మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 36 ఆదివారం 06 - 07 - 2025 పేజీలు: 8 వెల: 4

## గూడెం కొట్టాల వాసులకు పట్టాలు ఇస్తాం



3లో..

## యువతిని బంధించి
# మూడేళ్లుగా అత్యాచారం!

- మీరట్‌లో మదరసా టీచర్ అమానుషం
- విద్యార్థినిని మూడేళ్లుగా బంధించి లైంగిక దాడి
- మూడుసార్లు గర్భం దాల్చగా బలవంతంగా అబార్షన్లు



మన గళం డెస్క్ : ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ మదరసా టీచర్, బంధువైన విద్యార్థినిని మూడేళ్లుగా గృహ నిర్బంధంలో ఉంచి, చిత్రహింసలకు గురిచేస్తూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అఘాయిత్యంలో బాధితురాలు మూడుసార్లు గర్భం దాల్చగా, నిందితుడు తన భార్యతో కలిసి బలవంతంగా అబార్షన్లు చేయించాడు. ఈ అమానవీయ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడైన టీచర్‌ను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, బీహార్‌కు చెందిన 22 ఏళ్ల యువతిని ఐదేళ్ల క్రితం ఆమె బంధువైన 45 ఏళ్ల 2లో..

# మోదీ ఎమోషనల్ స్పీచ్

- ఇరు దేశాల మధ్య అనుబంధం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయిన మోదీ
- ప్రసంగం మధ్యలో స్పీకర్ చెయిర్ గురించి ప్రస్తావించారు మోదీ



మన గళం, న్యూఢిల్లీ : ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎమోషనల్ అయ్యారు. అక్కడి పార్లమెంట్‌కు హాజరైన మోదీ.. ఇరు దేశాల మధ్య అనుబంధం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోతో భారత్‌కు ఉన్న అనుబంధం, చారిత్రాత్మక సంబంధాల గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రసంగం మధ్యలో స్పీకర్ చెయిర్ గురించి ప్రస్తావించారు మోదీ. 2లో..



## ట్రంప్‌కు మోదీ
# తలొగ్గుతారు

- యూఎస్-భారత్ ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ విమర్శ
- డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారు

మన గళం, న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ విషయంలో ప్రధాని మోదీ.. అధ్యక్షుడు ట్రంప్ ముందు లొంగిపోతారని వ్యాఖ్యానించారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరు. నా మాటలు నమ్మక పోతే రాసిపెట్టుకోండి' అని రాహుల్ 2లో..

# రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డులు

- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

- ☐ క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- ☐ పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- ☐ నేతల ఫొటోలు లేకుండా ముద్రణ



మన గళం, అమరావతి : రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతోపాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు 2లో..

## చలించిపోయిన
# మంత్రి లోకేశ్

- చదువు చెప్పించాలని కమిషనర్‌ను వేడుకున్న నెల్లూరు చిన్నారులు
- వారి దీనస్థితిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్



మన గళం, అమరావతి : చదువుకోవాలన్న తపనతో ఇద్దరు చిన్నారులు అధికారులను వేడుకున్న ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా చలించిపోయారు. ఆ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను తక్షణమే ఆదేశించారు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, 2లో..

## పరిశ్రమల కేంద్రంగా
# ఎన్టీఆర్ జిల్లా

- ఎన్టీఆర్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే విధంగా కార్యాచరణ సిద్ధం



మన గళం, విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఇంఛార్జ్ మంత్రి సత్య కుమార్ ఈరోజు (శనివారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఉన్న వనరులు, పరిశ్రమల ఏర్పాటు, పర్యాటక అభివృద్ధి వంటి అంశాలపై ఎమ్మెల్యేలు, ఎంపీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా ఉన్న 2లో..

## మీ యోగక్షేమాలు
# తెలుసుకోడానికే వచ్చా

- ఇప్పుడు ఎన్నికలు లేవు ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడానికే వచ్చాం



మన గళం, అనకాపల్లి జిల్లా : జిల్లాలోని ఎస్ రాయవరం మండలం ధర్మవరం గ్రామంలో ఈరోజు (శనివారం) హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ధర్మవరంలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజులు చేశారు. ఆపై సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి వివరించారు. ఈ సందర్భంగా అడుగడుగునా హోంమంత్రికి మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. తరువాత గ్రామస్తులతో 2లో..

## కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లిన
# మంత్రి అచ్చెన్నాయుడు



- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

మన గళం, అమరావతి : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలంలోని చిన్న బమ్మిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ఇంటింటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. చిన్న బమ్మిడి గ్రామానికి 2లో..

## యువతిని బంధించి మూడేళ్లుగా అత్యాచారం!

మొదటిపేజీ తరువాయి వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మీరట్‌కు తీసుకొచ్చాడు. అనంతరం ఆమెను ఓ స్థానిక మదరసాలో చేర్పించి, తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. గత మూడేళ్లుగా ఆమెను బయటకు వెళ్లకుండా నిర్బంధించి, చిత్రహింసలు పెడుతూ లైంగికంగా వేధించాడు. బాధితురాలు ఈ విషయాన్ని ఎవరికైనా చెప్పడానికి ప్రయత్నిస్తే, ఆమెకు మానసిక స్థితి సరిగా లేదని ఇరుగుపొరుగు వారిని నమ్మించేవాడు.

జూన్ 9న బాధితురాలు ఇంటికి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఈ విషయం తెలుసుకున్న నిందిత దంపతులు ఆమెను మళ్లీ గదిలో బంధించారు. గురువారం మరోసారి ఆమెను తీవ్రంగా కొట్టడంతో, బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. ఆమె అరుపులు విన్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఈ దారుణం బయటపడింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని రక్షించారు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడైన టీచర్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద అత్యాచారం కేసు, అతడి భార్యపై నేరపూరిత కుట్ర కేసు నమోదు చేశారు. ఎస్పీ సిటీ ఆయుష్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ, "యువతి చేసిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి. నిందితుడైన టీచర్‌ను అరెస్ట్ చేశాం. ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు చేస్తున్నాం," అని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించామని, నివేదికల కోసం ఎదురుచూస్తున్నామని పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి భార్య కోసం గాలిస్తున్నారు.

## మోదీ ఎమోషనల్ స్పీచ్



దీన్ని చెక్కతో చేసిన సాధారణ కుర్చీలా చూడొద్దని.. ఇది భారత్-ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య ఉన్న స్నేహం, నమ్మకం, దృఢమైన ప్రజాస్వామ్య బంధానికి నిదర్శనమని తెలిపారు. ప్రధాని ప్రస్తావనతో అసలు ఈ కుర్చీకి ఉన్న చరిత్ర ఏంటో కనుక్కునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఏళ్ల పాటు బ్రిటీష్ పాలనలో ఉన్న ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 1962లో విముక్తి లభించింది. దీంతో ఈ దేశానికి 1968లో ఓ ప్రత్యేక బహుమతిని పంపించింది భారత ప్రభుత్వం. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ.. పార్లమెంట్‌లో స్పీకర్ కూర్చునేందుకు ఓ ప్రత్యేక కుర్చీని తయారు చేయించి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు గిఫ్ట్‌గా పంపించారు. ఫిబ్రవరి 8వ తేదీ, 1968న భారత హైకమిషనర్ మునీలాల్ ఈ కుర్చీని అక్కడి ప్రభుత్వానికి అందజేశారు. ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడేందుకు ఇది దోహదపడింది. అలాంటి కుర్చీని, ట్రినిడాడ్‌తో భారత్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ తాజాగా ఎమోషనల్ అయ్యారు మోదీ. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 180 ఏళ్ల కిందే భారతీయులు వచ్చారని ప్రధాని మోదీ తెలిపారు. సుదూర ప్రయాణాలు చేస్తూ, సముద్రాలు దాటి ఇండియన్స్ ఇక్కడికి చేరుకున్నారని చెప్పుకొచ్చారు. కరీబియన్ నేలతో తమకు గట్టి అనుబంధం ఏర్పడిందని, ఇక్కడి వారితో భారతీయులు చాలా బాగా కలసిపోయారని పేర్కొన్నారు. రాజకీయాల దగ్గర నుంచి కవిత్వం, క్రికెట్, వ్యాపారం వరకు.. ప్రతి విభాగంలో భారతీయులు భాగస్వాములు అవుతూ కీలకపాత్ర పోషిస్తున్నారని మెచ్చుకున్నారు మోదీ.

## ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు

వ్యాఖ్యానించారు. భారత ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 10 శాతం టారిఫ్ విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే, అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ భారత్ సహా పలు దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. ఏప్రిల్ 2న మన దేశంపై ట్రంప్ 26 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అదనపు సుంకాలను జులై 9 వరకూ నిలిపివేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం గతంలోనే ప్రకటించింది. అంతలోపు ఆయా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే, జులై 9 నుంచి అదనపు సుంకాలు వడ్డిస్తారు. అంతలోపే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలూ భావిస్తున్నాయి. ఈ అదనపు 26 శాతం సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని భారత్ కోరుతోంది. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలూ తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు చివరి దశకు వచ్చినట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. వాణిజ్య ఒప్పందంలో ఇరు దేశాలూ వ్యవసాయం, ఆటోమొబైల్స్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌లపైనే ఎక్కువగా దృష్టి పెట్టాయి. దేశంలో అధిక ఉపాధి కల్పించే తమ ఎగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, తోలు ఉత్పత్తుల ఎగుమతులపై అర్థవంతమైన రాయితీల కోసం భారత్ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. వ్యవసాయం, డెయిరీ రంగాల్లోనూ తమ ఉత్పత్తులకు పూర్తిస్థాయి మార్కెట్ ప్రవేశం కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. కానీ, దేశంలోని గ్రామీణ జీవనోపాధి, ఆహార భద్రత దృష్ట్యా ఈ రెండు కీలక రంగాలను ఒప్పందం పరిధి నుంచి దూరంగా ఉంచాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 9వ తేదీలోగా.. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఓ కొలిక్కి రానుంది. అయితే, రెండు దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటేనే వాణిజ్య ఒప్పందాన్ని భారత్ అంగీకరిస్తుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వెల్లడించిన విషయం తెలిసిందే.



## చలించిపోయిన మంత్రి నారా లోకేశ్

నెల్లూరు నగరంలోని వీఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమను బడిలో చేర్పించాలంటూ కమిషనర్‌ను ప్రాధేయపడ్డారు. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. వారి చదువుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక్కటే బలమైన సాధనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలన్న కసి, పట్టుదల ఉంటే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ చిన్నారుల ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కూడా ఆయన తన పోస్టుతో పాటు పంచుకున్నారు.

## కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు

మొదటిపేజీ తరువాయి చేరుకున్న అచ్చెన్నాయుడికి స్థానిక ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రతి ఇంటి గడప తొక్కుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు తీరును, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తమ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో తిరిగి తీసుకువస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.



## మీ యోగక్షేమాలు తెలుసుకోడానికే వచ్చా

ముఖాముఖీలో పాల్గొన్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు పల్లా అప్పలరాజుకు ఇటీవలే రోడ్డుప్రమాదం జరిగింది. దీంతో పల్లా అప్పలరాజును హోంమంత్రి పరామర్శించారు. అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ఇప్పుడు ఎన్నికలు లేవని - ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడానికి ధర్మవరం వచ్చినట్లు చెప్పారు. ధర్మవరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌లకు అధికారాలు లేవని అన్నారు. గత ఐదు సంవత్సరాలు ధర్మవరంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని.. ఒక్క డ్రైన్ పూర్తి చేయలేదని విమర్శించారు. నాడు - నేడు పేరుతో డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నో పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. గతంలో సరైన విత్తనాలు



కూడా ఇవ్వలేదని వ్యాఖ్యలు చేశారు. గతంలో సర్పంచ్‌లకు కనీసం బ్లీచింగ్ పౌడర్ జల్లడానికి కూడా డబ్బులు లేవని తెలిపారు. ఎన్డీయే పాలన - పారదర్శక పాలన అని చెప్పుకొచ్చారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభమతుందని వెల్లడించారు. గత ఐదు సంవత్సరాలు గంజాయి విచ్చలవిడిగా ఉండేదని... ఈగల్ ఏర్పాటు చేసి గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని అన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిని కఠినంగా శిక్షిస్తున్నామన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు రానున్నాయని ప్రకటించారు. నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, టాయ్ పరిశ్రమలు రానున్నాయని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ధర్మవరం గ్రామానికి చెందిన టీడీపీ సినీయర్ నాయకులు కలిగట్ల సూర్యనారాయణను హోంమంత్రి అనిత పరామర్శించారు. ఇటీవలే సూర్యనారాయణ గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో ఆయనను పరామర్శించి.. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు హోంమంత్రి.

## పరిశ్రమల కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లా

వనరులను గుర్తించేలా టీంలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి కాంక్షకులుగా ఉన్న వారిని గుర్తించి.. వారి సలహాలను తీసుకుంటామన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. అగ్రికల్చరల్, ఇండస్ట్రియల్, సర్వీస్ సెక్టార్లపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. చిరు వ్యాపారులు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన చేయూతను ఇస్తామని ప్రకటించారు. ఏడాదికి ఏడాదికి లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా తీర ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ ఆధారిత నియోజకవర్గాలలో వ్యవసాయం, పరిశ్రమలు నెలకొల్పడంపై శ్రద్ధ పెడుతున్నామని అన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు ఇప్పించి.. వారు ఆర్థికంగా నిలబడేలా చేస్తామని తెలిపారు. రాష్ట్రంతో



పాటు, ఇతర రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఈ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అనుమతులను సరళతరం చేస్తామని మంత్రి అన్నారు. మైనింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి.. అవసరమైన అనుమతులు ఇస్తామని అన్నారు. పర్యాటక ప్రదేశాల సందర్శనకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని.. అందుకే జిల్లాలో ఆయా ప్రదేశాలను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసి ప్రజలు తిలకించేలా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చేస్తామన్నారు మంత్రి. కొండపల్లి బొమ్మల ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు కళాకారులను ప్రోత్సహిస్తామని అన్నారు. అమరావతి నుంచి అనేక ప్రధాన ప్రాంతాలకు వెళ్లేలా ప్రధాన రహదారులు అనుసంధానం చేస్తామన్నారు. త్వరలోనే ఎక్స్ ప్రెస్ హైవే కూడా వస్తున్న నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్చలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రతీ అంశాన్ని పరిగణలోకి తీసుకుని అన్ని విధాలా ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా చర్చించామని.. తప్పకుండా త్వరలోనే ఫలితాలను అందరూ చూస్తారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది.



# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- పీ4 తొలి సమావేశంలో రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్
- పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు పక్కా ప్రణాళికలు
- మార్గదర్శి - బంగారు కుటుంబాల ఎంపిక వేగవంతం
- 2029 నాటికి 100% అర్హులందరికీ ఇళ్ళులు




మన గళం.కర్నూలు నగరపాలక సంస్థ : పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి స్వర్ణాంధ్ర-పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్షిప్) తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మార్గదర్శి - బంగారు కుటుంబాల ఎంపిక అర్హతలు పక్కాగా పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2029 నాటికి నియోజకవర్గంలో 100% అర్హులందరికీ ఇళ్ళులు తప్పనిసరిగా ఉండాలని, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాలల స్థితిగతులను పరిశీలించి, అవసరమైన ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, పాతబస్తీలో విచ్చలవిడిగా ఉన్న కరెంట్ తీగల సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట గోడలను శుభ్రపరిచి పెయింటింగ్ వెయ్యాలని, మొక్కలు నాటడం మరింత వేగవంతం చేయాలన్నారు. పార్కింగ్, వెండింగ్ జోన్ల ఏర్పాటు, పున్నమి రెస్టారెంట్ వెనుక ఖాళీ స్థలంలో వెండింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో గృహాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వం రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. తొలి సమావేశంలో పీ4 అమలు, ప్రధాన సమస్యల పరిష్కారం, అనేక అంశాలపై చర్చించామని వెల్లడించారు. భవిష్యత్తులో పేదరికం లేని సమాజాన్ని నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా తాను ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పీ4 ద్వారా సంక్షేమ పథకాల కోత ఉండదని, ఇది సంక్షేమానికి అదనమని సీఎం స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం, నిరంతర గైడెన్స్ ఇవ్వడం వంటివి మార్గదర్శులు బాధ్యత తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, సిఎంఎం భాస్కర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# గూడెం కొట్టాల వాసులకు పట్టాలు ఇస్తాం



జేసితో కలిసి గూడెం కొట్టాలను సందర్శించిన మంత్రి టి.జి భరత్

మనగళం, కర్నూలు నగరంలోని అశోక్ నగర్ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న గూడెం కొట్టాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ సందర్శించారు. గూడెం కొట్టాల ప్రజలతో మాట్లాడి పట్టాలు ఇచ్చే విషయంపై చర్చించారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఇక్కడ పర్యటించిన సమయంలో గూడెం కొట్టాల ప్రజలకు నివాసం ఉంటున్న చోటే పట్టాలు కావాలని అడిగారన్నారు. వెంటనే స్పందించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో వీరికి పట్టాలు ఇచ్చే విషయంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించినట్లు మంత్రి టి.జి భరత్ చెప్పారు. మొత్తం 155 మందికి త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా వీరు కోరుకుంటున్న పట్టాలను తమ ప్రభుత్వం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదేళ్లలో ఇల్లులేని వారు ఉండకూడదనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కర్నూలులో మాదక ద్రవ్యాల మత్తులో యువత

మన గళం కర్నూలు క్రైం : కర్నూలు ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాలు ప్రస్తుతం మాదకద్రవ్యాల అడ్డాగా మారాయి. నగర నడిబొడ్డున బహిరంగంగానే మాదకద్రవ్యాల సేవించే యువత సంఖ్య పెరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల వాడకం విచ్చలవిడిగా జరుగుతోంది. స్తానిక ఇందిరా గాంధీ నగర్ సీతారాం నగర్ చౌరస్తా సమీపంలోని యువత ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు.వీరు మత్తు పదార్థాలకు బానిసలై బస్ స్టాండ్ మరియు మార్కెట్ యార్డ్ లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో గంజాయి, ఇతర సింథటిక్ డ్రగ్స్ ను కొందరు స్మగ్లర్లు యథేచ్చగా విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల నేరాలు పెరిగే అవకాశం ఉందని, యువత భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల నిర్లక్ష్యమే కారణమా?

పోలీసు స్టేషన్ కు సమీపంలోనే ఈ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా, వాటిని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. స్థానికులు పోలీస్ సిబ్బందికి ఫోన్ చేస్తే తాము వేరే పనిలో ఉన్నామని తరువాత వస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.పోలీసుల మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు ఏర్పాటు చేసిన ఈగల్ వ్యవస్థ గస్తీని ముమ్మరం చేయాలని, మాదకద్రవ్యాల సరఫరా చేసే వారిని, వాటిని సేవించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. యువతను ఈ వ్యసనం నుండి కాపాడటానికి పోలీసులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కర్నూలు నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# డిజిటల్ అరెస్టు మోసం పై వచ్చే కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మన గళం,కర్నూలు క్రైం: ఇటువంటి కాల్స్ కు ప్రజలు ఎవ్వరూ స్పందించ వద్దు. వచ్చే కాల్స్ ను బ్లాక్ చేసి, సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషనుకు అందించాలి. మీ బ్యాంకు ఖాతా, పాస్పోర్టు, ఆధార్ కార్డు, మొబైల్స్ కు వచ్చే ఒ.టి.పి.లను ఎవ్వరికీ చెప్పవద్దు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్ళు వాట్సప్ / స్కైప్ ల ద్వారా వీడియో కాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శనివారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

ఈ మోసాల్లో మోసగాళ్లు పోలీసు అధికారుల పేరుతో కాల్ చేస్తూ, మీ పేరు మీద నేరం జరిగిందని, లేదా అంతర్జాతీయ ఛీటింగ్, డ్రగ్స్, మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని, బెదిరింపులకు పాల్పడుతూ వారు వీడియో కాల్ ద్వారా పోలీస్ యూనిఫాం ధరించి మాట్లాడతారన్నారు. ఫేక్ బ్యాడ్జులు చూపిస్తారు, నకిలీ ఐడిలు చూపిస్తూ నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తారన్నారు.

మోసగాళ్లు ప్రజలను మోసం చేసే తీరు / విధానం .

1.న్ లేదా వీడియో కాల్ చేస్తారు.

సిబిఐ,ఇ.డి. "సైబర్ క్రైమ్ డివిజన్", "నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో", లేదా "ఇంటర్‌పోల్" వంటి కేంద్ర సంస్థల పేర్లు ఉపయోగిస్తారు.

2.ఒక పార్సిల్,మోబైల్ నెంబర్, బ్యాంక్ అక్కౌంట్ మీ పేరిట ఉందని చెబుతారు %-% అందులో నేరపూరిత కార్యకలాపాలు జరిగాయని చెబుతారు.

3.వీడియో కాల్‌లో పోలీసు వేషధారణతో కనిపిస్తూ నకిలీ అరెస్ట్ వారెంట్ చూపిస్తారు.

4"డిజిటల్ అరెస్ట్" లో మీరు ఈ వీడియో కాల్‌ను డిస్కనెక్ట్ చేయకుండా ఉండాలని, లేకపోతే అరెస్ట్ చేస్తామంటారు.

5.డబ్బు చెల్లించమని బెదిరిస్తారు.

మీ ఖాతాల్లో ఉన్న మొత్తం ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేయాలని గట్టిగా ఒత్తిడి చేస్తారు.

జిల్లా ప్రజలకు పోలీసుల సూచనలు:

□ వాస్తవికంగాపోలీసు శాఖలు లేదా కేంద్ర ఏజెన్సీలువీడియో కాల్‌లో అరెస్టు లేదా విచారణ చేయవు.

□ ఎప్పుడూ దయచేసి వెరిఫై చేయని నంబర్ల నుండి వచ్చిన కాల్‌లకువ్యక్తిగత వివరాలు,బ్యాంక్ డీటెయిల్స్) చెప్పవద్దు.

□ అనుమానం కలిగిన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి.

□ ఈ రకమైన మోసాల గురించి మీ కుటుంబ సభ్యులకు, మిత్రులకు తెలియజేయండి ముఖ్యంగా వృద్ధులకు మరియు ఇంటి గృహిణులకు అవగాహన కలిగించండి.

ముఖ్య హెచ్చరిక:

మీరు ఎటువంటి నేరంలో పాలుపంచుకోకపోయినా, మీరు అమాయకుడైనా, ఈ మోసగాళ్ల బెదిరింపులకు భయపడి డబ్బులు పంపితే, మీరు మోసపోతారు. ఒక్కసారి డబ్బులు పంపిన తర్వాత వాటిని తిరిగి పొందడం చాలా కష్టమవుతుంది.

ముఖ్య సమాచారం:

సైబర్ మోసాల నివేదిక కోసం హెల్ప్‌లైన్ నంబర్: 1930

ఫిర్యాదు కోసం వెబ్‌సైట్

"ఈ ఆధునిక కాలంలో టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో మోసగాళ్లూ కూడా ఆ టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, డిజిటల్ మోసాల బారిన పడకుండా, పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని, ఈ తరహా నేరాల్లో ఎవరైనా నగదును పోగొట్టు కొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబరు క్రైం పోర్టల్లో కు ఫిర్యాదు చేయాలని జిల్లా ప్రజలను జిల్లా ఎస్పీవిక్రాంత్ పాటిల్ కోరారు.



– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

# డాక్టర్ ల సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ ల సమస్య తీర్చిన ప్రభుత్వం



– పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్

మనగళం, కర్నూలు :-జిల్లాలోని డాక్టర్ల సర్టిఫికెట్ రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్ మరియు ఇతర సేవల కొరకు జిల్లాలోనే రిజిస్ట్రేషన్ యూనిట్ ఏర్పాటు చేసి డాక్టర్ ల రిజిస్ట్రేషన్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజ్ కాంప్లెక్స్ లో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన డాక్టర్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ యూనిట్ ను పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర మఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడు ప్రజలకు మంచి చేయాలి అని నూతనంగా ఆలోచించే స్వభావం కలవారు. దానిలో భాగంగా ప్రజలకు 500 సర్వీసులతో వాట్సాప్ గవర్నెన్స్ ను అభివృద్ధి చేశారు. అదేవిధంగా మన రాష్ట్రంలో ఉన్న డాక్టర్లు వారి సర్టిఫికేట్ ల రిజిస్ట్రేషన్ లు, రీ- రిజిస్ట్రేషన్ లు మరియు ఇతర సేవలను ఎక్కడికక్కడ జిల్లాలో చేయించే ఏర్పాట్లు చేశారు. గతంలో రిజిస్ట్రేషన్ల కొరకు విజయవాడకు వెళ్ళవలసి వచ్చేది, విజయవాడకు వెల్లడము, ఏదైనా సర్టిఫికెట్ తక్కువ అయితే తిరిగి వెనక్కి రావడం చాలా శ్రమతో మరియు ఖర్చు తో కూడుకున్న వ్యవహారం, డాక్టర్ తమ విలువైన సమయం వెచ్చించడం 60 సంవత్సరాలు పై బడ్డ డాక్టర్లకు ఇంకా కష్టంగా ఉంటుంది. ఆ కష్టాల నుండి డాక్టర్లను విముక్తి చేశారు. ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. అందుకు మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నా అని మంత్రి టి.జి భరత్ అన్నారు. ఇటువంటి సేవలను డెంటల్ డాక్టర్లకు కూడా వర్తింప చేసే చర్యలు చేపట్టాలని చైర్మన్ ను మంత్రి కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు (ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ )మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే రీ-రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ చేయించే సేవలను తీసుకుని వచ్చామని , ప్రతి శనివారం, ఆదివారం ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గతంలో 40 వేల నుండి 50 వేల వరకు ఉండే రీ-రిజిస్ట్రేషన్ ను ఇప్పుడు 75 సంవత్సరాలు పైన ఉన్న వారికి 6 వేల రూపాయలకు, 75 సంవత్సరాలు లోపల ఉన్నవారికి 8 వేల రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయబడుతుందని తెలియజేశారు. ఐదు సంవత్సరాల కాలం కంటే మూడు నెలల ముందు గా కూడా రెన్యువల్ చేసుకోవచ్చని, బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు ఆన్లైన్ లోనే రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ చాలామంది డాక్టర్లు రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకొనకుండా ప్రాక్టీస్ లో ఉంటారని, దీనివల్ల వారి వైద్య వృత్తికి ఇబ్బందులు కలుగుతాయని , ఇప్పుడు విజయవాడకు వెళ్లకుండా కర్నూల్లోనే రెన్యువల్ మరియు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నందున డాక్టర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ విధమైన ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని మెడికల్ కౌన్సిల్ను అభినందించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరి ఇండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ లు మాట్లాడుతూ డాక్టర్లకు ఈ విధమైన మంచి అవకాశం కల్పించిన మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశానికి కళాశాల ప్రొఫెసర్ లు పాల్గొన్నారు

# కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా జే లక్ష్మీ నరసింహ యాదవ్

మనగళం, కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఏఐసిసి సభ్యులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ ను అధిష్టానం నియమించినది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్ గారి స్థానంలో జే లక్ష్మీ నరసింహ యాదవ్ గారిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి నియమించడ మైనదని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహ గారు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో కర్నూల్ జిల్లా ఇన్చార్జిగా నియమించినందుకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కాంగ్రెస్ సీనియర్ నాయకులను, కోఆర్డినేటర్లను కలుపుకొని వచ్చే వారంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని లక్ష్మీ నరసింహ గారు తెలియజేశారు.



# రేబిస్ ను నిర్లక్ష్యం చేయవద్దు..

మన గళం అవుకు : రేబిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని ఆ వ్యాధి వలన వచ్చే సమస్యలను పశువైద్యాధికారి డాక్టర్.భారతి శనివారం అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థుల ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ జినోటిక్ వ్యాధులు అనగా కుక్కల నుంచి వచ్చే రేబిస్ . కుక్కలు కరిచినప్పుడు వెంటనే చేయవలసిన ప్రథమ చికిత్సను తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఆదివారం ప్రపంచ జినోసిస్ దినోత్సవ సందర్భంగా ఆవుకు గ్రామంలో ఉచితముగా కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ను వేయడం జరుగుతుంది. కావున కుక్కలు పెంచుకునే ప్రతి యజమానీ వారి పెంపుడు కుక్కలకు టీకాలు వేయించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భారతీదేవితో పాటు, మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ రావు , రాజేష్ (ఎల్ ఎస్ ఏ) మరియు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# 104 ద్వారా ఇంటి వద్దనే వైద్యం



మన గళం అవుకు : 104 ద్వారా ఇంటి వద్దనే వైద్యం లబిస్తుందని వైద్యాధికారి డాక్టర్ నవీన్ శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 సేవలు మండల ప్రజలు విరివిరిగా వినియోగించుకోవాలి. 104 నందు 14 రకాల ఆరోగ్య పరీక్షలను చేస్తున్నామని తెలిపారు.అదేవిధంగా దీర్ఘకాలిక రోగాలతో మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులను ఇంటి వద్దనే పరీక్షించి మందులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. గర్భవతులకు కూడా పరీక్షలు చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలోనే భాగం గా గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి విద్యార్థులను కూడా పరీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరమ్మ, సి హెచ్ ఓ సల్మాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్దే నా ప్రాధాన్యత



**– పరిశ్రమలు వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్**

మనగళం, కర్నూలు :కర్నూలు మెడికల్ కాలేజీ ప్రాంగణంలో వైరల్ రీసెర్చ్ డయాగ్నొస్టిక్ ల్యాబ్ భూమి పూజ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ పాల్గొన్నారు. భూమి పూజ సందర్భంగా కర్నూలు జనరల్ ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం అని మంత్రి పేర్కొన్నారు. శనివారం ఉదయం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సముదాయంలో వైరాలజీ లేబరేటరీ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీ అత్యంత ప్రాముఖ్యం గలవి. ఇక్కడ నుండి ఎంతోమంది ప్రముఖ డాక్టర్లు ప్రాముఖ్యత చెందారని తెలిపారు. ఈ ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరిచే చర్యలు తీసుకుంటున్నామని, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, వైద్య సదుపాయం కల్పించే చర్యలు చేపడుతున్నామని అందులో భాగంగా వైరాలజీ ల్యాబ్ నిర్మాణానికి అనుమతులు తెప్పించుకున్నామని తెలిపారు. వైరాలజీ ల్యాబ్ అత్యంత సున్నితమైన వైద్య పరీక్షలు నిర్వహించే కేంద్రం. దానికి గాను భవనాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా క్రొత్తగా నిర్మించతలపెట్టి ప్రత్యేకముగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మాణాన్ని చేపడుతున్నామని, ఇది మూడు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఎప్పటికప్పుడు ఈ ఆసుపత్రి అవసరాలు తెలియజేస్తూ ఉన్నామని, గత ప్రభుత్వం మొదలుపెట్టి నిధులు కేటాయించక ఆగిపోయిన ఓపి బ్లాక్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ మధ్యనే 120 స్లైస్ సిటి స్కానింగ్ ప్రారంభించామని తెలిపారు. పి పి పి పద్ధతిలో సేవలందిస్తున్న స్కానింగ్ విభాగానికి నెలకు దాదాపు 30 లక్షల రూపాయలు చెల్లించడం జరుగుతుందని, ఆ కార్యక్రమాన్ని ఆపివేసి సొంతంగా స్కానింగ్ ఏర్పాటు చేసుకునే చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా వి.ఆర్.డి.ఎల్ అధికారిని డాక్టర్ రేణుక మాట్లాడుతూ ఈ లేబరేటరీలో ఫ్లూ , డెంగ్యూ , మలేరియా, కోవిడ్ వంటి అన్ని ప్రమాదకర వ్యాధుల పరీక్షలు నిర్వహిస్తామని ఇందుకుగాను భవనం ప్రత్యేకంగా ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ నిధులు 60లక్షల రూపాయలు వినియోగించి మూడు నెలల్లో పూర్తిచేసే చర్యలు చేపడుతున్నామని, ఈ పనులు జరగటానికి సహకరించిన మంత్రి, ప్రిన్సిపల్, జిజిహెచ్ సూపరిండెంట్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరి రావు, ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, జి జి హెచ్ సూపర్ఇండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు వైరాలజీ డిపార్ట్మెంట్ డాక్టర్ రేణుక మరియు సంబంధించిన డాక్టర్లు హాజరయ్యారు.

# పార్టీ అధిష్టానం అదేశాల మేరకే నాయకులు, కార్యకర్తలు పని చేయాలి

**– .పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు**
**– ఎంపీ బస్తిపాటి నాగరాజు**

మనగళం, ఆస్పరి :పార్టీ అధిష్టానం అదేశాల మేరకే నాయకులు, అధికారులు పని చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. కర్నూలు జిల్లా ఆస్పరిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, జిల్లా టిడిపి అధ్యక్షుడు తిక్కారెడ్డిల తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ ఆలూరు టిడిపి లో నెలకొన్న సమస్యలను

పరిష్కరించడంతో పాటు, ఎక్కడా వర్గ విభేదాలు లేకున్నా పార్టీ తలపెట్టె ప్రతి కార్యక్రమంలో అందరిని సమన్వ్యం చేయడానికి తనతో పాటు జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు లను నియోజకవర్గ ప్రోగ్రాం కమిటీ కో ఆర్డినేటర్లుగా నియమించిందన్నారు. నియోజకవర్గం లో ఎలాంటి సమస్యలు ఉన్నా కమిటీ దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు.. కార్యకర్తలకు న్యాయం చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీనేనని, అందుకు నిదర్శనం సాధారణ ఎంపీటీసీ గా ఉన్న తనని ఎంపీగా చేయడమేనన్నారు. పార్టీకి



వ్యతిరేకంగా పని చేసే వారి పై క్రమ శిక్షణ చర్యలు తప్పవని ఎంపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మండల టిడిపి అధ్యక్షుడు పరమ రెడ్డి , మాజీ జెడ్పిటీసీ మురళి రెడ్డి మరియు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి చేసిన ఎంపీ శబరి

మనగళం, నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మల సత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో శనివారం బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధుల చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు, నిరుపేద రోగులకు అండగా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అవసరమైన రోగులకు త్వరగా విడుదల చేస్తూ భరోసా కల్పిస్తున్నారని ఆమె వివరించారు. ఎంపీ గా తాను సీఎం రిలీఫ్ ఫండ్ కు సిఫారసు చేసిన వెంటనే బాధిత రోగులకు నిధులు విడుదల చేస్తూ వారి అకౌంట్ కే జమచేయడం జరుగుతుందని, అందులో భాగంగా నంద్యాల జిల్లా పరిధిలోని బాచుపల్లె గ్రామానికి చెందిన ముత్యాలపపాటి మహ్మద్ హుసేన్ కు రూ.81 వేలు, నంద్యాల ఎస్ బి ఐ కాలనీకీ చెందిన అనకాల సుజాత కు రూ. 31వేలు, నంద్యాల జగజ్జనని నగర్ కు చెందిన చాకలి లక్ష్మీదేవికి రూ. 45వేలు, నంద్యాల ముల్లాపేటకు చెందిన ముళ్ళ అస్మా కు రూ. 20 వేలు, నంద్యాల మండలం అయ్యాలూరుకు చెందిన సయ్యద్ నజియా సుల్తానాకు రూ.35వేల చెక్కులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణి చేశారు.

# చికిత్స పొందుతున్న డ్రైవర్‌కు ప్రభుత్వం సహాయం అందించాలి

**– జిల్లా ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి**

మనగళం, కర్నూలు :శుక్రవారం సాయంకాలం కలెక్టర్ ఆవరణలోని ఎస్బిఐ బ్యాంక్ ఆవరణలో నిలబెట్టుకున్న ఆటోపై చెట్టు పడి గాయపడ్డ డ్రైవర్ కు దెబ్బతిన్న ఆటో మరమ్మత్తులకు ప్రభుత్వ సహాయం అందించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి రాధాకృష్ణన ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కలెక్టర్ ఆవరణలో దెబ్బతిన్న ఆటోను ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ హుస్సేన్ వలీ బి రాధాకృష్ణ లు పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ కర్నూల్ సిటీ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప లో నివాసముండే ఓంకారామయ్య కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎస్బిఐలో విధులు నిర్వహించే ఒక ఉద్యోగిని ప్రతిరోజు ఆటోలో తీసుకువచ్చి మరల ఇంటికి శుక్రవారం సాయంకాలం ఆ ఉద్యోగిని ఇంటికి తీసుకు వెళ్లడానికి బ్యాంకు ముందు ఆటో నిలుపుకొని ఉండగా పెద్దగా వీచిన గాలులకు ఆటో ఎదురుగా ఉన్న పెద్ద చెట్టు విరిగి ఆటోపై పడడం వల్ల ఆటోలో ఉన్న ఓంకారమయ్యేకు తలకు గాయం కావడం వల్ల వెంటనే అతను చేరారని ఆటో పూర్తిగా డామేజ్ అయిందని వారన్నారు ప్రతిరోజు ఆటో నడిపితే కానీ కుటుంబాలు పోషించు కోలేని ఓంకారమయ్య జరిగిన నష్టం వల్ల అతని కుటుంబం ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందని ప్రభుత్వం తక్షణమే ఓంకారమయ్యాను దెబ్బతిన్న ఆటో పరమతలకు తక్షణ సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు ఆ విషయంపై జిల్లా రెవెన్యూ అధికారిని అయిన సి. నారాయణమ్మకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది ప్రభుత్వం వెంటనే స్పందించి డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో నాయకులు చంద్రశేఖరయ్య జి సత్యనారాయణ రెడ్డి, కే సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కులు హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలి

మనగళం, కర్నూలు : నగరంలోని నవత ట్రాన్స్పోర్ట్ హమాలీ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నవత ట్రాన్స్పోర్ట్ గోడౌన్ల వద్ద (దిన్నదేవరపాడు ) జరిగింది. ఈ సమావేశానికి నవత ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు రామచంద్రుడు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ జులై 9 వ తారీఖున దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం పని భద్రత ఈ ఎస్ ఐ పి ఎఫ్ సంక్షేమ బోర్డు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ సమ్మె జరగబోతున్నది ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని లేకపోతే అన్ని కేంద్రకార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింప చేస్తామని ఇప్పటికే హెచ్చరిక ఇచ్చి ఉన్నారు. కాదు కూడదని యజమానులకు అనుకూలంగా కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ చట్టాలను ముందుకు తీసుకుపోవాలని ప్రయత్నం జరిగితే రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు కుప్పకూలిపోతాయని కార్మిక శక్తి ఏంటో తెలియజేస్తారని హెచ్చరించారు. అందువలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాత కార్మిక చట్టాలను కొనసాగించి కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి సమాన



పనికి సమాన వేతనం పని భద్రత భీమా సౌకర్యం ఈఎస్ఐ పిఎఫ్ వంటి సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం నవత ట్రాన్స్పోర్ట్ మేనేజరు సుబ్బయ్య శెట్టి గారికి సమ్మె నోటీసును కార్మిక వర్గం నాయకులు అందజేశారు. శ్రీనివాసులు మిన్నల్లా రామనాయుడు మౌలాలి మహేష్ బజారి దేవరాజు విజయ నాయుడు శేఖర్ మంగన్న మధు మొదలగు వారు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**–కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ – జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

మన గళం,కర్నూలు క్రైం : ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ,జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు. 2025 (జనవరి నుండి జూన్ వరకు) గత 6 నెలల కాలంలో రోడ్డు ప్రమాదాల కేసులు మొత్తం 402 నమోదు అయ్యాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

కార్మికులకు మరణశాసనం లేబర్‌కోడ్స్

1991లో వచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలు, కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక వైఖరి, ప్రయివేటీకరణ పోకడల్ని నిరసిస్తూ, కార్మిక హక్కుల్ని కాపాడటం కోసం పది కేంద్ర కార్మిక సంఘాలు నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా 21 సమ్మెలు నిర్వహించాయి. ప్రధాన రంగాల ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడి ఆహ్వానాన్ని వ్యతిరేకిస్తూ మొదటి దేశవ్యాప్త సమ్మె 29 నవంబర్ 1991లో మొదలైంది. కార్మికులకు అధిక వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాల్లో సంస్క రణలకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెల్లో కార్మికులు ప్రతియేటా పాల్గొంటు న్నారు. అంతేకాక ఉద్యోగ భద్రత, పెన్షన్ హక్కును డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెలు నిర్వహిస్తున్నారు. 2020 నవంబర్ 26న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్ల మంది అనగా 250 మిలియన్ల కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె ద్వారా తమ నిరసన తెలియజేశారు. ఇది ప్రపంచంలో జరిగిన అతిపెద్ద సమ్మెల్లో ఒకటని జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు అభివర్ణించాయి. 2019 జనవరి 8-9 తేదీల్లో జరిగిన రెండు రోజుల సమ్మె, 2022 మార్చి 28-29 తేదీల్లో జరిగిన సమ్మెలు, బ్యాంకింగ్, రవాణా, ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రభావితం చేశాయి. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక కార్మికుల హక్కుల కోసం పోరాడే శక్తివంతమైన వేదికగా నిలుస్తున్నది. జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె కూడా అందులో భాగం కానుంది.

ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసత్వంలోకి నెట్టి వేసే లక్ష్యంతో 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు అడుగులు వేస్తున్నది. ఫ్యాక్టరీల్లో, పని ప్రదేశంలో యూనియన్లు లేకుండా చేయటమే లక్ష్యంగా, కార్మికవర్గాన్ని నిరాయుధుల్ని చేయడమే ధ్యేయంగా ఈ లేబర్ కోడ్స్ అని స్పష్టమవుతున్నది. 2002లో అప్పటి వాజ్‌పాయి ప్రభుత్వం 2వ లేబర్ కమిషన్‌ను రవీంద్రవర్మ నేతృత్వంలో నియమించి 44 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్‌ను తీసుకురావాలని ప్రతిపాదించింది. ప్రస్తుత మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, చట్టవిరుద్ధ విధానాలు దాదాపు అన్ని కూడా 2వ లేబర్ కమిషన్ సిఫార్సులను పోలి ఉండటాన్ని గమనిస్తే అప్పటినుండి యజమానులకు అనుకూలంగా, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయ పూనుకున్నదన్న విషయం అవగతమవుతున్నది. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి వామపక్ష పార్టీల సహకారం ఉండటం వల్లన లేబర్‌కోడ్స్‌ను తీసుకురావడానికి వెనుకడుగు వేసింది. 2014లో తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి వాటి ప్రక్రియను ప్రారంభించింది. కార్మిక సంఘాల సమ్మెలు, పోరాటాల వలన వెంటనే అమలు చేయడానికి ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. 2019లో మూడోసారి అధి కారం చేపట్టిన తర్వాత పార్లమెంట్‌లో వేతనాల కోడ్‌ను పాస్ చేయించుకుంది. 2020లో మిగిలిన మూడు పారిశ్రామిక సంబం ధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్స్‌ను ఆమోదించుకుంది. మూడు వ్యవ సాయ నల్లచట్టాలు పార్లమెంటులో ప్రవేశపెట్టగా అప్పటి ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యులు వాటికి నిరసనగా వాకౌట్ చేసిన సమయంలో ఈ లేబర్ కోడ్స్‌ను దొడ్డిదారిలో ఆమోదింపజేసుకుంది.

ఈ లేబర్‌కోడ్స్‌ను సరిగ్గా పరిశీలిస్తే కార్మిక వర్గంపై ప్రత్యక్ష దాడిచేసి వారి హక్కుల్ని హరించేందుకు ఉద్దేశించిన విధంగా ఇవి రూపొందించబడ్డాయి. దేశ సహజ వనరులను, ప్రజలను దోచుకోవడానికి, కార్పొరేట్ యాజమా న్యాలకు లాభాలు కట్టబెట్టడానికి, కార్మికులను మరింత దోపిడీ చేసేలా ఉన్నాయి. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన కార్మికులు, సంఘాలు కార్మికులతో కలిసి నిరంతర పోరాటాలు, ఆందోళనలు, ప్రతిఘటనలు చేయడం వల్ల ఈ నాలుగేండ్ల నుంచి ఈ లేబర్‌కోడ్స్‌ని అమలు చేయటంలో కేంద్రం కాస్తా వెనుక్కు తగ్గింది. అయితే 2025లో ఈ లేబర్ కోడ్స్‌ను ఎలాగైనా అమలు చేయలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం "జన విశ్వాస్" అనే చట్టంలోని నిబంధనల ప్రకారం అనేక చట్టాల కింద కార్పొరేట్లకు సంబంధించి 180 నేరాలను నేరరహితం చేసింది. ఈ చట్టాలను ఉల్లంఘించినందుకు యజమానులకు జైలు శిక్షలు విధించే నిబంధనలను ఈ లేబర్ కోడ్స్‌లో ఉపసంహరించింది. 2025 కేంద్ర బడ్జెట్‌లో కూడా మరో 100 నేరాలను నేర రహితం చేసింది. "శ్రమ సమాధాన్", "శ్రమ సువిధ పోర్టల్"లు యజమానులు కార్మిక చట్ట ఉల్లంఘనలను సులభతరం చేయడానికి, ఫిర్యాదు ఆధారిత తనిఖీలను ఈ లేబర్ కోడ్స్ ద్వారా రద్దు చేసింది.

మరోవైపు కార్మికులు పోరాడి సంపాదించు కున్న హక్కులను కాలరాస్తూ సమిష్టి బేరసారాల చర్యలను లేబర్‌కోడ్స్ తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నది. కార్మికులు వారి సంఘాలు సమిష్టిగా ఫిర్యాదు చేయడం లాంటి వాటిని వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని పేర్కొంటు న్నది. ఫలితంగా నాన్ బెయిలబుల్ శిక్షలతో సహా పోలీసు చర్యలకు దారి తీసే ప్రమాదం కూడా ఉంది. ఈ లేబర్ కోడ్స్ అమలు చేయడానికి ముందుగానే గేట్ మీటింగులు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు, కరపత్రాల పంపిణీ, మెమొరాం డాలు అందజేయటం లాంటి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను, హక్కులను ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, సంస్థల్లో ఇప్పటికే నిషేధించింది. ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని తీసుకురావడం ద్వారా ఉద్యోగ భద్రతతో పాటు అనేక సౌకర్యాలు అందచేయకుండా చూడటమే దీని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది. శాశ్వత ఉద్యోగి, ఉపాధి అనేది ఒకప్పటి విషయం. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్, అప్రెంటీస్‌లు, ఇంటర్న్‌షిప్‌లు మొదలైన విధానాల ద్వారా కార్మికులను కేంద్రం నియమిస్తున్నది. అంతేకాక ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలను కూడా కార్మికులకు దూరం చేసే రూల్స్‌ను ఈ లేబర్‌కోడ్స్‌లో పొందుపరిచింది. ఇది ట్రేడ్ యూనియన్‌లను బలహీనపరచడానికి, యూనియన్లను తొలగించడానికే అనేది స్పష్టమవుతున్నది. దీనిద్వారా కార్మికుల్లో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించే పథకం చాపకింద నీరులా మోడీ సర్కార్ అనుసరిస్తున్నది. లేబర్ కోడ్స్ అమలు అంటే మొత్తం పరిపాలనలో కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గం విధానాల అమలుకు ఎలాంటి అడ్డం కులు లేకుండా కొనసాగించుకోవడానికి, యథేచ్ఛగా లాభాలు ఆర్జించటానికేనన్నది స్పష్టమవుతున్నది. యూనియన్ల రహిత పని ప్రదేశాల ఏర్పాటు, కార్మికుల సమిష్టి చర్యలను నిర్వీర్యం చేసి వారిని నిరాయుధులను చేయడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది. కార్మికుల హక్కుల్ని కాలరాసే మరణ శాసనాలుగా ఈ లేబర్‌కోడ్స్ పనిచేయ నున్నవి. అందుకే ఈనెల 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను గతంలో నిర్వహించిన సమ్మెల్లో ఒకటిగా చూడకూడదు. లేబర్ కోడ్స్ అమలును తీవ్రంగా తిప్పికొట్టడానికి ప్రతిఘటనా, పోరాటాల ప్రారం భంగా ఈ సమ్మెను చూడాలి. పెట్టుబడి దారీ విధానాన్ని తరిమేయడంలో కార్మిక వర్గం మరింత మెలకువతో ముందుండాలి. నయా ఉదార వాదానికి వ్యతిరేకంగా, ఐక్యపోరాటాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకుని వెళ్లాలి. ఈ సమ్మె రెండవ దశ పోరాటానికి ప్రారంభం మాత్రమేనని దేశ ప్రజానీకానికి తెలియజేయాలి.

# వైసిపి హయంలో రాజధాని, పోలవరం నిర్మాణం గాలికొదిలేశారు

- చంద్రబాబు సంపద సృష్టించి ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు
- త్వరలో రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ డబ్బులు జమ
- మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి



మనగళం, నంద్యాల గత ఐదేళ్ల వైసిపి పాలనలో అమరావతి రాజధాని , పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను పూర్తిగా గాలికి వదిలేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి , నంద్యాల రాష్ట్ర పార్టీ పరిశీలకులు, రాష్ట్ర టీడీపీ అధికారప్రతినిధి ఆలం నరసానాయుడు విమర్శించారు. ఈ సందర్భంగా నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో మార్కెఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి గారి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి , నంద్యాల రాష్ట్ర పార్టీ పరిశీలకులు, రాష్ట్ర టీడీపీ అధికారప్రతినిధి ఆలం నరసానాయుడు కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. స్వయంగా ప్రజలని సమస్యలను అడిగి తెలుసుకోని మై టిడిపి ఆప్ నందు నమోదు చేయడం జరిగింది అలాగే అధికారులకు కూడా సమస్యలను వివరించి త్వరలో పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కొత్తపల్లె కి విచ్చేసిన మంత్రి, ఎంపీ, నంద్యాల పరిశీలకులకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ ప్రజలు నీరాజనాలు పలికారు. ముందుగా గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ఆలయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు .

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేశారన్నారని. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే అమరావతి రాజధాని , పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన తల్లికి వందనం పథకం కింద ఇంట్లో చదివే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు మంజూరు చేశారని తెలిపారు. అంతేకాకుండా 3 వేలు ఉన్న పెన్షన్ రూ. 4 వేలకు పెంచి ప్రతినెల 1వ తారీఖున సాయంకాలం లోపు 64 లక్షల పేద కుటుంబాలకు పింఛన్లు మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కుతుందని తెలిపారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని తెలిపారు. ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచితంగా అందజేస్తున్నారు అన్నారు . అంతేకాకుండా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. మరో 20 ఏళ్లు రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండాలని చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి గా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంతో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తెలియజేస్తామని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి పాలన సాగిందని అన్నారు. అలాగే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏపి లో అభివృద్ధి జరుగుతుందని మరో ఐదేళ్లలో అభివృద్ధి ఆంధ్ర ప్రదేశ్ గా మారుతుందన్నారు. నంద్యాల రాష్ట్ర పార్టీ పరిశీలకులు, రాష్ట్ర టీడీపీ అధికారప్రతినిధి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి వైపు నడిపించే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం లో ఆర్థిక విధ్వంసం కొనసాగిందని మరో 50 ఏళ్లు అభివృద్ధిలో రాష్ట్ర వెనుకబడిందన్నారు. ఇలాంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రాష్ట్రంలో 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదలకు మూడు పూటలా కడుపునిండా అన్నం తినే భాగ్యాన్ని కూటమీ ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. పార్టీ కోసం బాగా కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# సామాజిక బాధ్యతగా అల్ట్రాటెక్ సంస్థ వైద్య పరికరాల వితరణ చేయడం అభినందనీయం



- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

మన గళం,నంద్యాల కలెక్టరేట్ : అల్ట్రాటెక్ సిమెంటు సంస్థ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యతగా పలు రకాల వైద్య పరికరాలను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లో అల్ట్రాటెక్ సంస్థ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సుమారు రూ. 12 లక్షల విలువైన వైద్య పరికరాలను కలెక్టర్ సమక్షంలో సర్వజన ఆసుపత్రి వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... అల్ట్రాటెక్ సంస్థ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను అందజేయడం సంతోషకరమన్నారు. ఇందులో ఒక ఈసిజి మెషిన్, 2 డెఫ్రిబిలేటర్స్, 1 సక్షన్ అప్పారేటస్, 2 వైన్ ఫైండర్స్ అందజేయడం జరిగిందన్నారు. ఈ వైద్య పరికరాల ద్వారా జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగ్గా సేవలు అందజేసే అవకాశం ఏర్పడిందన్నారు. అల్ట్రాటెక్ సంస్థ వారిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ అల్ట్రాటెక్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, యూనిట్ హెడ్ సాజేంద్ర కుమార్, సిఎస్ఆర్ అడ్మిన్ అంజన్ ప్రకాష్, సిఎస్ఆర్ హెడ్ సురేష్, సిఎస్ఆర్ మేనేజర్ గోపాల్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రసన్నకుమార్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూలై 10వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం



- తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యం కావాలి
- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

మనగళం, నంద్యాల :జిల్లాలో ఈ నెల 10వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో తల్లిదండ్రులు భాగస్వాములై విద్యార్థిని, విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన చర్చలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1336 ప్రభుత్వ పాఠశాలలు, 619 ప్రైవేటు పాఠశాలలు మొత్తంగా 1959 పాఠశాలల్లో కూడా ఈ నెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో ఉన్న 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివిలో ఉన్న 27 జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్ లో ఉన్న 20 జూనియర్ కళాశాలలతో పాటు, గిరిజన, సాంఘిక, బిసి వసతి గృహాల జూనియర్ కళాశాలతో పాటు జిల్లాలో ఉన్న 66 ప్రైవేటు కళాశాలలో కూడా సమావేశాలు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశాలలో తల్లిదండ్రులు ఖచ్చితంగా భావస్వామ్యులు కావాలని తద్వారా తమ పిల్లలను వారు ఏ స్థాయిలో చూడాలనుకుంటున్నారు ? అందుకు ఉపాధ్యాయులు వారిని ఏ విధంగా తీర్చిదిద్దాలనే విషయాలపై సూచనలు ఇవ్వాలన్నారు. అదే విధంగా పిల్లలందరికీ గత సంవత్సరంతో సాధించిన ఫలితాల ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు, హెల్త్ కు సంబంధించిన రిపోర్టుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం ఎంత మేరకు జమ అయ్యిందనే వివరాలను ప్రోగ్రెస్ రిపోర్టులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సమావేశంలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులలో సమావేశమై వారి విద్యా పురోగతి గురించి వివరిస్తూ, క్రీడలు, పాఠశాల అభివృద్ధి పై తల్లిదండ్రులకు వివరించి అందుకు తగిన వీడియోలు ప్రదర్శించడంతో పాటు, ఆటల పోటీలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రీన్ పాస్పోర్ట్ కార్యక్రమంలో భాగంగా మొక్కల మీద ప్రేమతో లీప్ యాప్ లో నమోదు చేసుకున్న పిల్లలందరికీ మొక్కలు అందజేసి "ఏక్ పేడ్ మాకే నామ్" (తల్లి పేరు మీద మొక్క)ను నాటించడం జరుగుతుందన్నారు. సజావుగా ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ప్రతి పాఠశాలకు ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించడం జరుగుతోందన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రుల నుండి స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొనేలా ఆహ్వానం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందజేస్తున్న భోజన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులకు పాల్గొంటారన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణ మిత్రా కిట్స్ ను పిల్లలందరికీ అందజేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలతో పాటు, అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతోందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హరిత బనగానపల్లె నా లక్ష్యం



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మనగళం, బనగానపల్లె :హరిత బనగానపల్లె బహిరంగ సభ అనంతరం పెట్రోల్ బంకు సర్కిల్ నుంచి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిర్వహించిన ర్యాలీలో బనగానపల్లె ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమార్ గణియా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ తో కలిసి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మొక్కలు నాటడం జరిగింది. అదేవిధంగా బనగానపల్లెలోని రోడ్డు డివైడర్లలో విద్యార్థులు యువతతో కలిసి బీసీ ఇందిరమ్మ మొక్కలు నాటడం జరిగింది.. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తంగా రూ. 30 లక్షల విలువైన మొక్కలు - కుండీలు కొనుగోలు చేసి.. దాదాపుగా 5 వేల మొక్కలను నాటడం ద్వారా హరిత బనగానపల్లె సంకల్పానికి శ్రీకారం చుట్టడం జరిగింది.



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పెద్ద ఎత్తున బనగానపల్లె నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, డాక్టర్ లు, నియోజకవర్గం ప్రజలు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ

తన పుట్టినరోజు సందర్భంగా బనగానపల్లెను పచ్చదనంతో నింపాలనే ఆలోచనతో ఈ మొక్కలు నాటే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.. గతంలో పచ్చగా ఉండే బనగానపల్లి నేడు ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, భారీ నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్ గా మారిపోయిందన్నారు. నేడు హరిత బనగానపల్లెగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తన సతీమణి బీసీ ఇందిరమ్మ తన సొంత నిధులు రూ. 30 లక్షలతో మొక్కలు - కుండీలు కొనుగోలు చేసి.. మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తన అభిరుచికి అనుగుణంగా మంచి, అరుదైన మొక్కలు కోసం ప్రత్యేకంగా తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీల నుంచి ఈ మొక్కలను తీసుకురావడం జరిగిందన్నారు. ముందుగా రోడ్లపై డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి ప్రాంతాల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. మొక్కలు మేము నాటుతాం. వాటిని సంరక్షించి చెట్లుగా పెంచే బాధ్యత బనగానపల్లె ప్రజలదేనన్నారు. ముఖ్యంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు, యువత మరింత ఉత్సాహంతో పాల్గొనాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బనగానపల్లెలో చెట్లను బతికించుకుందాం - పచ్చని బనగానపల్లెకు శ్రీకారం చుడదాం అన్న మంత్రి స్లోగన్ కు విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలతో బదులిచ్చారు. గతంలో ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమాన్ని ప్రారంభించి దాదాపు 80 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన 20 శాతం పూర్తి చేయాలంటే బనగానపల్లె వాసులు అందరూ సంపూర్ణ సహకారం అందించాలని చేతులెత్తి కోరుతున్నమన్నారు.మనం బనగానపల్లెలో ప్లాస్టిక్ నిర్మూలపై చేసిన పోరాటంపై నేడు చాలా చోట్ల చర్చ జరుగుతుందన్నారు. నేడు నాటే ప్రతి మొక్కను పెంచి చెట్లుగా తీర్చిదిద్దితే అవి భవిష్యత్తులో మహా వృక్షాలుగా మారి ఎందరికో నీడనిస్తాయన్నారు.. గతంలో అశోకుడు చెట్లు నాటిన విషయం ఈనాటికి చెప్పుకుంటామని.. అలాగే నేడు మీరు నాటిన చెట్లను భవిష్యత్తులో మీకు గొప్ప జ్ఞాపకాలుగా మిగిలిపోతాయన్నారు.

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ

బనగానపల్లె పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువత భారీ ఎత్తున తరలిరావడం సంతోషం కలిగించిందన్నారు. బనగానపల్లె పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి - ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో చాలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్య - సంతోష - సుసంపన్న రాష్ట్రంగా చూడాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అన్నారు. మన గ్రామం, మన ఇంటి నుంచి మార్పు మొదలైతేనే ఇటువంటి సామాజిక కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. ముఖ్యంగా ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయలేమని, కాబట్టి ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు అయ్యి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.. గతంలో ప్లాస్టిక్ రహిత బనగానపల్లె నినాదంతో ముందుకు వెళ్లి విజయవంతం చేశారన్నారు.. మంచి నీరు, గాలి, ఆరోగ్యం, వాతావరణం కోసం బనగానపల్లె ప్రజలు ప్లాస్టిక్ ను పూర్తిగా వదిలేయడం చాలా సంతోషకరమైన విషయం.. అయితే దానిని నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు.. నేడు నాటే మొక్కలను జాగ్రత్తగా పెంచి పెద్ద చేయాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు.. ఇంతటి మహెూన్నత కార్యక్రమంలో తాను కూడా భాగస్వామ్యం కావడం సంతోషం కలిగించిందన్నారు.

బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ..

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి బనగానపల్లె ను చూస్తే ఒక ఆశ్రమం తరహాలో పచ్చదనం కనిపించాలనే లక్ష్యంతో తామంతా కృషి చేస్తున్నామన్నారు. 6 నెలల క్రితం మొదలుపెట్టిన ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమానికి సహకరించిన షాపులు, యాజమాన్యాలు, విద్యార్థులు, యువత బనగానపల్లె ప్రజలకు ధన్యవాదాలఅన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్ వాడటం పూర్తిగా మానేశారని.. నాతో ఆయా పాఠశాలల టీచర్లు, ప్రిన్సిపల్ లు చెప్తుంటే చాలా ఆనందం కలిగిందన్నారు. నిజంగా ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో విద్యార్థుల పాత్ర ఎంతో గొప్పది అన్నారు. ఇప్పటివరకు బనగానపల్లెలో ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమాన్ని 80 శాతం పూర్తి చేసామని, ఇంకో 20 శాతం పూర్తి చేయడానికి బనగానపల్లిలో ఇప్పటికీ ప్లాస్టిక్ వాడుతున్న కొన్ని షాపులు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలోనే నాడు భవిష్యత్తులో బనగానపల్లె ను పచ్చదనంతో తీర్చిదిద్దామని మాటిచ్చామన్నారు. నేడు దానికి అనుగుణంగా బనగానపల్లె మొత్తం మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా ఆమె పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జూలై 10న రాష్ట్ర వ్యాప్తంగా 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమం

**- జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి**

**- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు :ఈ నెల 10 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఆ మేరకు జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. పేరెంట్-టీచర్ మీటింగ్ ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 10 వ తేదీన జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని కలెక్టర్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాల్లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారులు, ఎంఈఓలు ఎంపిడిఓలు, తహశీల్దార్లు, ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులతో స్వయంగా ఆహ్వాన పత్రికలను తయారు చేయించి, కార్యక్రమానికి మంత్రులు, ఎంపీ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, ఇతర ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. సంబంధిత పాఠశాల, కళాశాలల్లో ప్రతిభ సాధించిన వారు ఎవరైనా ఉంటే వారు, షైనింగ్ స్టార్ అవార్డులు తీసుకున్న వారు అలాంటి వారందరిని ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. అదే విధంగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విద్యార్థి కి సంబంధించిన సమగ్ర పురోగతి కార్డులను అందించాలన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాపరమైన పనితీరు, కార్యాచరణ ప్రణాళికల గురించి చర్చించాలన్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు ఇవ్వాలన్నారు. తల్లులకు రంగవల్లుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి సరదా ఆటలను నిర్వహించి తల్లిదండ్రుల్లో స్నేహభావాన్ని పెంపొందింప చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ పెరగాలని కలెక్టర్ సూచించారు. మెగా పేరెంట్స్ టీచర్ డే రోజున గ్రీన్ పాస్ పోర్ట్ - అమ్మ పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించడం జరుగుతోందన్నారు. విద్యార్థులకు గ్రీన్ పాస్ పోర్ట్ జారీ చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించి, వారితో తల్లి పేరు మీద మొక్కలు నాటించాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులు, పాఠశాల ప్రాంగణాలు సుందరీకరించాలని సూచించారు. తల్లికి వందనం పేరుతో తల్లుల పాదాలకు విద్యార్థులు నమస్కారం చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా ఆ రోజున శుభ దిన్ భోజనం పేరుతో మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాటు చేసుకుని మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఘనంగా జరిగిన రిటైర్డ్ టీచర్ బి.మాణిక్యం శెట్టి గారి ఆత్మీయ అభినందన సభ

మన గళండోన్ పట్టణంలోని లోకల్ ఫండ్ స్కూల్ నందు టీచరుగా పనిచేస్తూ జూన్ 30వ తేదీన రిటైర్మెంట్ అయినా బి మాణిక్యం శెట్టి గారి ఆత్మీయ అభినందన సభ పట్టణంలోని మధు ఫంక్షన్ నందు ఉపాధ్యాయ కార్మిక సంఘాలు ఆత్మీయులు బంధుమిత్రుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ ఆత్మీయ అభినందన సభను ఉద్దేశించి యుటిఎఫ్,ఎస్ టి యు సిఐటియు రాష్ట్ర జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ బి.మాణిక్యం శెట్టి గారు విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పుతూ మంచి గురువుగా పేరు పొందారని తాను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు అనేక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తరుణంలో సంబంధిత గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకమై అధిక సంఖ్యలో విద్యార్థులను బడులకు దగ్గర చేసిన ఉపాధ్యాయులు బి. మాణిక్యం శెట్టి గారిని వారు కొనియాడారు బి మాణిక్యం శెట్టి గారి పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకున్న అనేకమంది నేడు అనేక ఉన్నత ఉద్యోగాలు సాధించి చదివిన పాఠశాలలకు మంచి గుర్తింపు తీసుకువచ్చే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో మాణిక్యం శెట్టి గారు నేర్పిరి అని వారు తెలిపారు ఒకపక్క టీచరుగా పనిచేస్తూనే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ సంఘంలో చేరి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి హక్కుల సాధనకై అనేక పోరాటాలు నిర్వహిస్తూ అంచలంచెలుగా రాష్ట్ర నాయకత్వం వరకు



పనిచేస్తూ ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడి ఉపాధ్యాయులు సాధించుకున్న హక్కుల పోరాటంలో బి.మాణిక్యం శెట్టి గారిది ప్రత్యేకం అని వారన్నారు. రాష్ట్రంలో దేశంలో ప్రజలు మూఢనమ్మకాల బారిన పడి తన కుటుంబాలను జీవితాలను నాశనం చేసుకుంటే మరోపక్క దేశంలో కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ మతతత్వాన్ని పెంచి ప్రోత్సహిస్తూ పాలిస్తున్నటువంటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మూఢనమ్మకాలు వద్దు-సైన్స్ ముద్దు అని అంటూ జన విజ్ఞాన వేదిక (జే వీ వి) నాయకత్వన ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మేల్కొల్పడంలో బి.మాణిక్యం శెట్టి గారి సేవలు అమోఘము అని వారు గుర్తుచేశారు. ఈ ఆత్మీయ సభలో యుటిఎఫ్,ఎస్ టి యు, ఎస్ఎఫ్ఐ,సి ఐ టి యు, ఐద్వా, అంగన్వాడి, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక సంఘాలతోపాటు వారి బంధువులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ నుండి బళ్లారి చౌరస్తా వరకు ప్రచార ర్యాలీ

మన గళం,కర్నూలు సిటి : కర్నూల్ నగరంలోని సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ నుండి బళ్లారి చౌరస్తా వరకు జూలై 9న జరిగే కార్మిక దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక ప్రచార ర్యాలీకార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు నగర నాయకులు కే సుధాకరప్ప అధ్యక్షత వహించారు ప్రచార ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్ సాయి బాబా నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు %ు%.రాముడు గార్లు రాలికి విచ్చేసిన కార్మికులను ఉద్దేశించిమాట్లాడుతూ కేంద్రరాష్ట్రప్రభుత్వాలుతీసుకువచ్చిన ఉద్యోగ కార్మిక కర్షక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పని భద్రత కల్పించాలని ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేయకూడదని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను స్కీమ్ వర్కర్లనుపర్మినెంట్ చేయాలని ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేసి ఆటో హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చే విధానాన్నిఉపసంహరించుకోవాలని జులై 9 వ తారీఖున దేశవ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగింది ఈ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుదారి కార్పొరేట్ వ్యక్తులకు పక్షాన కాకుండా ఉద్యోగ కార్మిక కర్షకుల పక్షాన నిలబడకపోతే రాబోయే రోజుల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. జులై 9 వ తారీఖున ఉదయం




10 గంటలకు కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి మహా కార్మిక ప్రదర్శన బయలుదేరి కలెక్టర్ కార్యాలయం చేరుకొని సభ నిర్వహించబడుతుంది ఈ కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు జి ఏసు ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ హమాలి యూనియన్ నాయకులు కృష్ణమూర్తి చెన్నయ్య విజయుడు శంకర్ శ్రీరాములు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడువులు పెడితే కుదరదు.. జాతి ప్రయోజనాలకే ప్రాధాన్యత

మన గళం గడువుల మీద ఏ వాణిజ్య ఒప్పందానికీ ఏ దేశంతోనూ భారత్ దిగబోదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు. అమెరికాతోనూ ఇంతేనన్న ఆయన.. జాతి ప్రయోజనాలకే తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. అలాంటప్పుడే అగ్రరాజ్యంతోనైనా ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌ను అంగీకరిస్తామని శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు ఇచ్చిన విరామం ఈ నెల 9తో ముగుస్తున్న క్రమంలో మంత్రి పైవిధంగా స్పందించారు. భారత ప్రయోజనాలకు తగ్గట్టుగా డీల్ ఉంటేనే అమెరికాకు తమ అంగీకారం తెలుపుతామని వెల్లడించారు. కాగా, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ఓ భారత బృందం ఏర్పాటైన విషయం తెలిసిందే. ఆటో రంగంలో 25 శాతం, ఉక్కు-అల్యూమినియం ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను ఈ చర్చల్లో భారత్ ప్రస్తావనకు తెస్తున్నది. ఇతర దేశాలతోనూ.. అమెరికాతోపాటు యూరోపియన్ యూనియన్ (ఈయూ), న్యూజీలాండ్, ఒమన్, చిలీ, పెరు తదితర దేశాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్నట్టు మంత్రి గోయల్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం ఆయా దేశాలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. అయితే ఇరువైపులా ప్రయోజనాలు ఉన్నప్పుడే ఎఫ్‌టీఏలు కుదురుతాయని గుర్తుచేశారు. ఇదిలావుంటే భారత్, నాలుగు ఐరోపా దేశాల కుటమి మధ్య ఎఫ్‌టీఏ.. రాబోయే రెండు నెలల్లో కుదిరే వీలుందని గోయల్ తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# ఆ సినిమా నాకెంతో ప్రత్యేకం : ప్రియాంక చోప్రా

మన గళం : హాలీవుడ్‌లో సెటిల్ అయిన ప్రియాంక చోప్రా.. భారతీయ సినిమాలు అరాకొరా మాత్రమే చేస్తున్నది. ఎస్.ఎస్.రాజమౌళి, మహేష్‌బాబు కాంబినేషన్‌లో రూపొందుతున్న '%యూవీదీ%29', హృతిక్‌రోషన్ దర్శకత్వంలో రూపొందనున్న 'క్రిష్ 4'.. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ఇండియన్ మూవీస్ ఈ రెండే. ముఖ్యంగా రాజమౌళి సినిమాలో నటిస్తుండటంతో ఆమెకు సంబంధించిన ఏ వార్త అయినా సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయిపోతున్నది. రీసెంట్‌గా ఓ ఆంగ్ల పత్రికకు ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూని మహేష్ అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. తాను ఓ ప్రెస్టేజియస్ ఇండియన్ మూవీలో నటిస్తున్నట్లు, ఆ ప్రాజెక్ట్ కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్టు ఆమె ఈ ఇంటర్వ్యూలో తెలిపారు. 'నేను ఇండియాను, హిందీ సినిమాలను మిస్ అవుతున్నాను. ఈ ఏడాది ఒక భారతీయ సినిమాకు సైన్ చేశాను. ఆ సినిమా నాకెంతో ప్రత్యేకం.' అని ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు ప్రియాంక. మణిరత్నం 'బొంబాయి' సినిమాను ఆమె గుర్తుచేసుకుంటూ 'నేను సినీనటినే కానీ, సినిమాలు చూస్తూ పెరిగిన నటిని కాదు. జీవితంలో చాలా తక్కువ సినిమాలు చూశా. మా నాన్నకు సంగీతం అంటే ఇష్టం. అందుకే ఇంట్లో ఎప్పుడూ ఏదోఒక సంగీతం వినిపిస్తూవుండేది. నాకు 13ఏండ్ల వయసులో ముంబయ్‌లోని ఓ థియేటర్‌లో మణిరత్నం 'బొంబాయి' సినిమా చూశాను. ఊహ తెలిశాక నేను చూసిన తొలి సినిమా అదే. ఆ అనుభవం జీవితంలో మరిచిపోలేను. ఇప్పటికీ 'బొంబాయి' సినిమా చూస్తే ఏదో తెలీని ఫీలింగ్.' అంటూ చెప్పుకొచ్చింది ప్రియాంక.




# ఆపరేషన్ డ్రీమ్ థియేటర్

మన గళం : 'సప్తసాగరాలు దాటి' వంటి హృద్యమైన ప్రేమకథా చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు హేమంత్ రావు. ఆయన రూపొందిస్తున్న తాజా చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. డాలీ ధనుంజయ, శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రధారులు. జె. ఫిల్మ్స్ పతాకంపై వైశాక్ గౌడ నిర్మిస్తున్నారు. శుక్రవారం డాలీ ధనుంజయ్ న్యూలుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'పుష్ప' సిరీస్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన డాలీ ధనుంజయ్..'666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'లో విభిన్నమైన పాత్రను పోషిస్తున్నారని, ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. కన్నడ, తెలుగు భాషల్లో ఈ చిత్రాన్ని ఏకకాలంలో విడుదల చేయబోతున్నారు.


# పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' వీర విహారం

మన గళం : పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' థియేట్రికల్ ట్రైలర్ గురువారం విడుదలైన విషయం తెలిసిందే. విడుదలైన క్షణం నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఈ ట్రైలర్‌కు బ్రహ్మరథం పడుతున్నారని మేకర్స్ తెలిపారు. 24 గంటల్లోనే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, అత్యధిక వ్యూస్ సాధించిన తెలుగు ట్రైలర్‌గా 'హరిహర వీరమల్లు' ట్రైలర్ రికార్డును నెలకొల్పిందని, అన్ని భాషల్లో కలిపి దాదాపు 62 మిలియన్ల వ్యూస్ సాధించిందని శుక్రవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. జ్యోతికృష్ణ దర్శకత్వ ప్రతిభ, ఎం.ఎం.కీరవాణి నేపథ్య సంగీతం, జ్ఞానశేఖర్, మనోజ్ పరమహంసల విజువల్స్, సాయిమాధవ్ బుర్రా శక్తివంతమైన సంభాషణలు, అన్నింటినీ మించి ట్రైలర్‌లో పవన్‌కల్యాణ్ అభినయం.. ఇవన్నీ ఆడియన్స్‌ని మంత్రముగ్ధుల్ని చేశాయని నిర్మాత ఎ.దయాకర్‌రావు అభిప్రాయపడ్డారు. రాజ కుటుంబీకురాలిగా నిధి అగర్వాల్, ఔరంగజేబుగా బాబీ డియోల్ స్క్రీన్ ప్రెజెన్స్ ట్రైలర్‌కు నిండుతనాన్ని తెచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 24న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రంలో అనుపమ్‌ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సమర్పణ: ఎ.ఎం.రత్నం.



# కార్తీక్ ఆర్యన్‌పై బాలీవుడ్ పెద్దల కుట్రలు సంచలన వ్యాఖ్యలు చేసిన సింగర్ అమాల్ మాలిక్

మన గళం హీరో కార్తీక్ ఆర్యన్‌పై బాలీవుడ్ పెద్దలు కుట్ర చేస్తున్నారని, సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ తరహాలోనే ఆయన్ని మానసికంగా వేధించి ఇండస్ట్రీ నుంచి పక్కకు తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు సంగీత దర్శకుడు, సింగర్ అమాల్ మాలిక్. హిందీ సినీరంగానికి చెందిన బడా నిర్మాతలు, తారలు ఈ కుట్రలో భాగస్వాములుగా ఉన్నారని ఆయన ఆరోపించారు. ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. బాలీవుడ్ ప్రపంచం తాలూకు చీకటి కోణం భయంకరంగా ఉంటుందని, సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్‌ను నైతికంగా దెబ్బతీసి ఆయన్ని ఆత్మహత్యకు పురిగొల్పారని, కార్తీక్ ఆర్యన్ విషయంలో కూడా అదే రకమైన వ్యూహాల్ని అమలు చేస్తున్నారని అమాల్ మాలిక్ అన్నారు. 'కొత్తవాళ్లు ఎదిగితే ఇక్కడ తట్టుకోలేరు. వారిని అణగదొక్కాలని ప్రయత్నిస్తారు. కార్తీర్ ఆర్యన్‌కు ఎలాంటి సినీ నేపథ్యం లేదు. అయినా కష్టపడి పైకొచ్చాడు. అది పెద్దలకు కంటగింపుగా మారింది. ఆయన్ని తొక్కేయాలని ఇప్పటికే ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయితే కార్తీక్ ఆర్యన్‌కు ఫ్యామిలీ సపోర్ట్ ఉండటం వల్ల సరైన మార్గంలో పయనిస్తున్నాడు. అయినా ఆయన విషయంలో కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. కార్తీక్ ఆర్యన్ జాగ్రత్తగా ఉండటం మంచిది' అంటూ అమాల్ మాలిక్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన మాటలు బాలీవుడ్‌లో సంచలనంగా మారాయి.



# పెళ్లి చేసుకోవడం మిస్టేక్.. నయన్ ఏంటి అంత మాట అనేసింది

మన గళం : లేడీ సూపర్‌స్టార్ నయనతార ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఓ స్టేట్మెంట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. భర్త విఘ్నేశ్ శివన్‌పై కోపాన్ని చూపిస్తూ పెట్టినట్టు అనిపించిన ఆ పోస్ట్ కొద్ది సేపటికే డిలీట్ అయ్యింది. నయనతార, భర్త విఘ్నేశ్ శివన్‌లు ఇద్దరు ప్రస్తుతం తమ ఇద్దరి బిడ్డలతో మదర్, ఫాదర్ హుడ్‌లను ఆస్వాదిస్తున్నారు. మరోవైపు వరుస సినిమాలు చేస్తూనే బిజీగా గడుపుతున్నారు. తాజాగా నయనతార తెలుగులో చిరంజీవి, అనీల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా చేస్తోంది. గతంలో ధనుష్‌తో ఓ వీడియో విషయంలో జరిగిన వ్యవహారం కాంట్రవర్సీగా మారి కొన్ని రోజులు వార్తల్లో ప్రధానంగా నిలిచింది. ఆ ఇష్యూ ఇప్పుడు కోర్టులో ఉండగా నయన్ మాత్రం ఇటీవల భర్త, పిల్లలతో కలిసి విదేశాల్లో హాలీడేస్ ఎంజాయ్ చూస్తూ ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ నెట్టింట హడావుడి చేస్తోంది. రెండు రోజులుగా ఇండియాలో ఆలయాలు దర్శించుకుంటూ భక్తి పారవశ్యంలో ఉంది. ఇటీవలే మూడవ వివాహ వార్షికోత్సవం కూడా పూర్తి చేసుకున్నారు. అయితే.. ఇది ఇలాఉండగానే తాజాగా నయనతార విషయంలో ఓ న్యూస్ ఇప్పుడు టోటల్ ఇండియాలో హాట్ టాపిక్ అయింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ స్టోరీ పోస్ట్ ఈ జంట మధ్య విభేదాలపై ఊహాగానాలకు తావిస్తోంది. తాజాగా నయనతార తన ఇన్ స్టా అకౌంట్‌లో తెలివి తక్కువ వారిని పెళ్లి చేసుకోవడం మన తప్పు.. వారు చేసే పనులకు మనం బాధ్యత వహించాల్సిన అవసరం లేదు.మగ వాళ్లు ఎప్పుడు నేర్చుకోలేరు. ప్రేమించి.. పెళ్లి చేసుకున్న తర్వాత తన బాధ్యతను సరిగ్గా నిర్వహించడం లేదని.. ఇక నా వల్ల కాదు దయచేసి వదిలేయండి... అనే అనే అర్థం వచ్చే మాటలతో ఓ పోస్టు పెట్టి కాసేపటికి డిలీట్ చేసింది. దీంతో ఒక్కసారిగా ఈ పోస్టు వైరల్ అయింది. అయితే.. ఈ స్టేట్మెంట్‌ను నయనతార స్వయంగా పోస్ట్ చేశారని కొంతమంది అంటుండగా మరి కొంతమంది మాత్రం ఫేక్ అంటూ కొట్టి పడేస్తున్నారు. మరెవరినైనా ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారా అనేది తెలియాల్సి ఉంది. కాగా ఈ వార్తలపై నయనతార గానీ, విఘ్నేష్ గానీ ఇప్పటివరకు స్పందించి ఎలాంటి ప్రకటన చేయలేదు. వీరిద్దరిలో ఎవరైనా అధికారికంగా ప్రకటిస్తే గానీ ఈ వార్తలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అప్పటివరకు ఇలాంటి అనేక వార్తలు మరిన్ని వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ పోస్టు పెట్టి డిలీట్ చేసిన రోజే నయన్ దంపతులు ఇరువురు కలిసి మురుగన్ టెంపుల్‌ను సందర్శించడం గమనార్హం.



# నేనేమి చేసినా ఫుల్ ట్రెండింగ్

మన గళం : వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకుడు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగాన్ని పెంచారు. శుక్రవారం 'వైరల్ వయ్యారి..' అనే గీతాన్ని విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ గీతాన్ని కల్యాణ్ చక్రవర్తి రచించారు. 'ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫాలోయింగ్ చూశావంటే మైండ్‌బ్లోయింగ్.. ఫాలోవర్స్ అందరికీ నేనే డార్లింగ్.. నేనేమి చేసినా ఫుల్ ట్రెండింగ్..' అంటూ యూత్‌కు కనెక్ట్ అయ్యేలా సోషల్‌మీడియాలో వాడే లాంగ్వేజ్‌తో ట్రెండీగా ఈ పాట సాగింది. దేవిశ్రీప్రసాద్, హరిప్రియ ఆలపించారు. ఇందులో కిరీటి రెడ్డి, శ్రీలీల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. జెనీలియా, రవిచంద్రన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సెంథిల్ కుమార్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, రచన-దర్శకత్వం: రాధాకృష్ణ.



## క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉందన్నారు:





**– డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి భాస్కర్ రావు**

మన గళం, డోన్ : డోన్ శివారులోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి అవుట్డోర్ క్రీడామైదానంలో నంద్యాల జిల్లా మోడరన్ పెంటాతలన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, సంఘం కార్యదర్శులు పృథ్వీ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగాలలో లేజర్ రన్ ఎంపిక పోటీలకు భాస్కర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, క్రీడలు ఆడడం వల్ల శారీరకంగానూ మానసికంగాను దృఢంగా ఉంటారని రాబోయే రోజుల్లో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు, అదేవిధంగా పాతపేట సుధాకర్ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మంచి భవిష్యత్తు ఉందన్నారు, ఇందుకోసం ప్రతిరోజు మంచి సాధన చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు, అలాగే ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జూలై 11 నుండి 13 వరకు నరసరావుపేట పల్నాడు జిల్లాలో జరిగే 9వ రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటతలాన్ పోటీలలో జిల్లా తరపున ప్రాతినిథం వహిస్తారని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో తరుణ్, లు రామ్మోహన్, అబ్దుల్ రహీం, అనిల్, ఓబుల్ రెడ్డి తదితరులు



# భారీ ఆధిక్యం దిశగా.. భారత్ లీడ్ 244
# ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 407 ఆలౌట్



మన గళం: ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ భారీ ఆధిక్యం దిశగా సాగుతున్నది. ఆట మూడో రోజు ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులకు ఆలౌట్ చేసిన గిల్ సేన.. 180 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ఇండియా.. ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 64 రన్స్ చేయడంతో గిల్ సేన ఆధిక్యం 244కు చేరింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ యువ బ్యాటర్లు జెమీ స్మిత్ (207 బంతుల్లో 184 నాటౌట్, 21 ఫోర్లు, 4 సిక్సర్లు), హ్యారీ బ్రూక్ (234 బంతుల్లో 158, 17 ఫోర్లు, 1 సిక్స్) రికార్డుస్థాయిలో త్రిశతక భాగస్వామ్యంతో వీరవిహారం చేసి ఆ జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (6/70) ఆరు వికెట్లతో విజృంభించగా ఆకాశ్ దీప్ (4/88) నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్ (28) త్వరగానే నిష్క్రమించినా రాహుల్ (28 నాటౌట్), కరుణ్ (7 నాటౌట్) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. నాలుగో రోజు భారత బ్యాటర్లు.. స్టోక్స్ సేన ఎదుట ఏ మేరకు లక్ష్యాన్ని నిర్దేశిస్తారనేదానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. స్మిత్, బ్రూక్.. 'బజ్‌బాల్' దూకుడు : 84/5.. మూడో రోజు ఉదయం ఆట ఆరంభమయ్యాక ఈ స్థితిలో ఉన్న ఇంగ్లండ్.. రెండు సెషన్ల పూర్తి ఆట ముగిసేసరికి 385/5కి చేరిందంటే అది అద్భుతమే! జీవం లేని బర్మింగ్‌హామ్ పిచ్‌పై యువ బ్యాటర్లు స్మిత్, బ్రూక్ ద్వయం భారత బౌలర్ల సహనానికి పరీక్షపెడుతూ ఏకంగా త్రిశతక భాగస్వామ్యంతో అదరగొట్టింది. మూడో రోజు సిరాజ్ వేసిన రెండో ఓవర్లోనే ఇంగ్లండ్.. వరుస బంతుల్లో రూట్ (22), స్టోక్స్ (0) వికెట్లను కోల్పోయినా ఆ జట్టు దూకుడు ఏమాత్రం తగ్గలేదు. కీలక బ్యాటర్లను ఔట్ చేసిన ఆనందం గిల్ సేనకు ఎంతోసేపు మిగల్లేదు. ఆరో స్థానంలో వచ్చిన స్మిత్.. బ్రూక్‌తో కలిసి భారత బౌలర్లను ఆటాడుకున్నాడు. అతడు టీ20 తరహాలో చెలరేగిపోవడంతో తొలి సెషన్‌లో ఇంగ్లండ్.. 27 ఓవర్లలోనే ఏకంగా 6.37 రన్‌రేట్‌తో 172 రన్స్ సాధించిందంటే ఆ జట్టు దూకుడు ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన స్మిత్.. 'బజ్‌బాల్' ఆటతీరుతో ఓవర్‌కు ఓ బౌండరీకి తగ్గకుండా భారత బౌలర్లను శిక్షించాడు. బ్రూక్ కాస్త నెమ్మదించినా బాదే బాధ్యతను భుజానికెత్తుకున్న స్మిత్.. ప్రసిద్ధ్ వేసిన 32వ ఓవర్లో 4, 6, 4, 4, 4 తో 23 పరుగులు పిండుకున్నాడు. 43 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తిచేసిన అతడు.. ఆ తర్వాత శతకానికి చేరడానికి తీసుకున్నది 37 బంతులే. ఈ జోడీని విడదీయడానికి గిల్.. పదే పదే బౌలర్లను మార్చినా ఫలితం శూన్యం. జడ్డూ బౌలింగ్‌లో రెండు బౌండరీలతో 80 బంతుల్లోనే స్మిత్ టెస్టుల్లో రెండో శతకాన్ని నమోదుచేశాడు. మరో ఎండ్‌లో బ్రూక్ సైతం.. హాఫ్ సెంచరీ తర్వాత తన సహజశైలికి మారడంతో భారత బౌలర్లకు నిరాశ తప్పలేదు.

జోరు తగ్గినా.. : లంచ్ తర్వాత ప్రసిద్ధ్ వేసిన 51వ ఓవర్లో చివరి బంతిని బౌండరీకి తరలించిన బ్రూక్.. లీడ్స్‌లో తృటిలో చేజారిన శతకాన్ని బర్మింగ్‌హామ్‌లో సాధించాడు. టెస్టుల్లో అతడికి ఇది 9వ సెంచరీ. అయితే తొలి సెషన్‌లో వీరవిహారం చేసిన ఈ జోడీ.. రెండో సెషన్‌లో కాస్త నెమ్మదించినా పరుగుల వేటను మాత్రం ఆపలేదు. సిరాజ్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన స్మిత్.. 150 పరుగుల మార్కును అందుకున్నాడు.

కొరత తీర్చిన కొత్త బంతి : క్రీజులో పాతుకుపోయి అప్పటికే 300ం భాగస్వామ్యం నమోదుచేసిన బ్రూక్–స్మిత్ జోడీ ద్విశతకాల దిశగా సాగుతున్న వేళ 81వ ఓవర్లో తీసుకున్న కొత్త బంతి భారత్‌కు ఊరటనిచ్చింది. 83వ ఓవర్లో ఆకాశ్.. బ్రూక్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 303 పరుగుల రికార్డు భాగస్వామ్యానికి తెరపడింది. వోక్స్ (5) సైతం ఆకాశ్ బౌలింగ్‌లో స్లిప్స్‌లో కరుణ్ చేతికి చిక్కాడు. సిరాజ్ లోయరార్డర్ పనిపట్టాడు. కార్స్ (0)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న ఈ హైదరాబాదీ పేసర్.. టంగ్‌నూ పెవిలియన్‌కు పంపి ఐదు వికెట్ల ఘనతను సాధించాడు. బషీర్‌నూ క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ జట్టు చివరి ఐదు వికెట్లను 7.2 ఓవర్లలో 20 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.

## అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో..నిత్యావసర వస్తువుల పంపిణీ

**– అమ్మ నాన్నల ఋణం తీర్చుకుందాం – అవోపా మహిళా విభాగ్ కర్నూలు అధ్యక్షురాలు బి.అనితా దేవి**



మన గళం,కర్నూలు రూరల్ : అవోపా మహిళా విభాగం అవసరార్థులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసింది. ఆ విభాగం కర్నూలు అధ్యక్షురాలు బి.అనితా దేవి ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు నగర శివార్లలోని ఆది శంకరాచార్య తపోవనం,శిల్పా టౌన్ షిప్ లో ఉన్న వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అవోపా మహిళా విభాగ్ కర్నూలు అధ్యక్షురాలు బి.అనితా దేవి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లి,దండ్రులను నిర్ధయగా ఆశ్రమాల్లో వదిలి వేయరాదన్నారు. ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులను తమ తల్లి,దండ్రులుగా భావించి, వారితో కొంత సమయాన్ని వెచ్చించి, వారిలో ఆనందాన్ని పంచాలని సంస్థ సభ్యులను ఆమె కోరారు. సంస్థ సభ్యులందరూ ఇలాంటి మంచి కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని, అలా వీలు కాని పక్షంలో నగదు రూపంలో గానీ, లేదా వస్తు రూపంలో గానీ పి.ఎస్.టి.లకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సంస్థ సభ్యులందరికీ ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవోపా మహిళా విభాగ్ సెక్రెటరీ బి.సరిత,కోశాధికారిణి ఎల్.వి.శోభారాణి,తదితరులు పాల్గొన్నారు.





# మాడిసన్ కీస్ ఇంటిబాట

మన గళం వింబుల్డన్ ఆరంభంనుంచి రోజుకో సీడెడ్‌కు చుక్కెదురవుతోంది. ఐదో రోజు..ఆరో సీడ్ మాడిసన్ కీస్ ఇంటిబాట పట్టింది. ఆమెతోపాటు నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ నవోమి ఒసాకాకు కూడా మూడో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. అలాగే పురుషుల నాలుగో సీడ్ జాక్ డ్రేపర్‌కూ ఓటమి తప్పలేదు. రెండో సీడ్ అల్కారజ్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో లారా సీగ్మండ్ 6–3, 6–3తో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్‌కు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో పల్యుచెన్కోవా 3–6, 6–4, 6–4తో ఒసాకాను చిత్తు చేసి నాలుగో రౌండ్‌కు చేరింది. 13వ సీడ్ అనిసిమోవా 6–3, 5–7, 6–3తో దల్మా గాఫీపై మూడో రౌండ్‌లో నెగ్గింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్ 6–1, 3–6, 6–3, 6–4తో స్ట్రఫ్‌పై, 5వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6–4, 6–3, 6–7 (7), 6–1తో 26వ సీడ్ దవిడోవిచ్‌పై, 14వ సీడ్ రుబ్లేవ్ 7–5, 6–2, 6–3తో మన్నారినోపై గెలుపొందారు. ఇక గురువారం అర్ధరాత్రి జరిగిన రెండో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ సినర్ 6–1, 6–1, 6–3తో ఉకిక్‌ని వరుస సెట్లలో ఓడించాడు. మరో మ్యాచ్‌లో వెటరన్ మారిన్ సిలిచ్ 6–4, 6–3, 1–6, 6–4తో నాలుగో సీడ్ డ్రేపర్‌ను తిరుగుముఖం పట్టించాడు. 10వ సీడ్ బెన్ షెల్టన్ 6–2, 7–5, 6–4తో హిజికటాపై నెగ్గి మూడో రౌండ్‌కు చేరాడు. మూడో రౌండ్‌లో భాంబ్రీ జోడీ: యుకీ భాంబ్రీ/జియాంగ్ జిన్‌యు (చైనా) ద్వయం మిక్స్‌డ్ డబుల్స్ మూడో రౌండ్‌కు చేరింది. రెండో రౌండ్‌లో భాంబ్రీ/జియాంగ్ జంట 6–3, 1–6, 7–6 (6)తో నికోల్/క్రిస్టియన్ అమెరికా జోడీపై నెగ్గి ముందంజ వేసింది..



## బంగ్లాదేశ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన రద్దు




మన గళం : బంగ్లాదేశ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన రద్దు కానుంది. ఆ దేశంలో ఏడాది కాలంగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో టీమిండియా పర్యటన దాదాపు లేనట్టేనని బీసీసీఐ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. ఆగస్టు 17 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ పర్యటనలో భారత్–బంగ్లాదేశ్ మూడు టీ20లు, మూడు వన్డేలలో తలపడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌లో ఆడే మ్యాచ్‌ల ద్వారా లభించే పాయింట్లు వన్డే ప్రపంచ కప్‌నకు అర్హత సాధించేందుకు కీలకం కావడంతో భారత పర్యటన పూర్తిగా రద్దు కావడంలేదు. వచ్చే ఏడాది ఆ టూర్ జరిగే అవకాశముందని ఆయన వివరించారు.

## గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్ విభాగంలో గుకేష్ హవా



మన గళం : గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్ విభాగంలో గుకేష్ హవా కొనసాగుతోంది. శుక్ర వారం జరిగిన 7, 8 రౌండ్లను గుకేష్ డ్రా చేసుకొని 12 పాయింట్లతో టాప్‌లో కొన సాగుతున్నాడు. జీఎంలు అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో ఆడి న ఏడో రౌండ్‌ను, సరిక్ ఇవాన్ (క్రొయేషియా)తో జరిగిన ఎనిమిదో రౌండ్‌ను గుకేష్ డ్రా చేసుకున్నాడు.

# జావెలిన్ విప్లవానికి నాంది..



మన గళం బెంగళూరు తన పేరిట శనివారం ఇక్కడ జరుగనున్న క్లాసిక్ ఈవెంట్ దేశంలో జావెలిన్ త్రో విప్లవానికి నాంది పలకగలదన్న ఆశాభావాన్ని నీరజ్ వ్యక్తంచేశాడు. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో ఈ పోటీ జరగనుంది. భవిష్యత్ భారత జావెలిన్ త్రోయర్లలో ఈ టోర్నీ స్ఫూర్తి నింపుతుందని నమ్ముతున్నాడు. నీరజ్‌తోపాటు మరో ఇద్దరు ఒలింపిక్ పతక విజేతలు థామస్ రోలెర్, జూలియస్ ఎగో పోటీ బరిలో దిగుతున్నారు. భారత్ నుంచి చోప్రాతోపాటు రోహిత్ యాదవ్, సాహిల్ సిల్వాల్, జస్వీర్ సింగ్ తలపడుతున్నారు. మొత్తం 12 మంది త్రోయర్లు ఈ ఈవెంట్ బరిలో నిలిచారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310